క్లుప్తంగా

వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో వసతులపై ఆరా



పీహెచ్‌సీలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్

పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి డీఎంహెచ్‌వో హేమంత్ కుమార్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. మందులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయుడుపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రక్త పరీక్షలు, మందులపై ఆరా తీశారు. స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు పోషకాహారం, ఐరన్ మాత్రల పంపిణీపై వాకబు చేశారు. చిన్నారులకు ఐరన్ మాత్రల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ వెన్నల సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై ఫిర్యాదు



చంద్రబాబునాయుడు

పరవాడ: మండల పరిధి చింతల గొర్లివానిపాలెం గ్రామంలో నాలుగేళ్ల నుంచి నివసిస్తున్న వంతల చంద్రబాబునాయుడు 3 నెలల నుంచి కనిపించడం లేదని స్టీల్‌ప్లాంట్‌లో నివసిస్తున్న అతని తండ్రి దేవినాయుడు గురువారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విశాఖ పోర్టులో ఉద్యోగం చేస్తున్న చంద్రబాబు నాయుడుకు చీడికాడ మండలం కోనాం గ్రామానికి చెందిన దేముడమ్మతో 2019లో వివాహం జరిపించారు. అనంతరం చంద్రబాబునాయుడు భార్య, కుమార్తెతో కలిసి చింతల గొర్లివానిపాలెంలో నివసిస్తున్నారు. కొంత కాలం తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో 7 నెలల క్రితం కుమార్తెను తీసుకొని దేముడమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు మూడు నెలల నుంచి కనిపించలేదు. స్నేహితులు, బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి సమావేశం రేపు

సింహాచలం : టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి సమావేశం శనివారం సింహాచలం సమీపంలోని పాత గోశాల వద్ద ఎస్ఎన్ఆర్ కల్యాణ మడపంలో నిర్వహించనున్నట్లు 98వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా గురువారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, రాష్ట్ర టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రామయ్య ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. బ్రాహ్మణుల ఇబ్బందులు తెలుసుకుని, వారికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతకి సంబంధించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

పీఆర్‌సీతో పాటు ఐఆర్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న షేక్ బాబూరావు

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీతో పాటు ఐఆర్(మధ్యంతర భృతి) కూడా మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 12వ పీఆర్‌సీకి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఏ విధమైన కమిటీ సిఫార్స్ లేకుండా 12వ పీఆర్‌సీ అమలు జరుగుతుందని, అలాగే మధ్యంతర భృతి కూడా ప్రకటించినట్లైతే ఉద్యోగులు మరింత ఆనందంగా ఉంటారన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

పరవాడ: మండలంలో శుక్రవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు రావాడ, 10 గంటలకు కలపాక గ్రామాల సచివాలయాల్లో పాల్గొంటారని తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 7997958341, 9912440606

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం



మల్లునాయుడుపాలెంలో ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ అప్పారావు

సబ్బవరం : వివక్ష లేకుండా ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలియజేశారు. మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడు పాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గుల్లేపల్లిలో తహసీల్దార్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ విధేయులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించేవారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తిస్తున్నారన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. అనంతరం ఆమె ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, కోటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, మల్లునాయుడుపాలెం సర్పంచ్ బోను దేవుడమ్మ, ఈవోపీఆర్‌డీ మహేష్, ఎంపీటీసీ సభ్యుడు కనకరాజు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బండారు శ్రీను, బోను గంగునాయుడు, బైలపూడి దేముడు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి ఉభయ దాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, తదితరులు ఈ సేవ నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి, విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీలో మెరుపులు



ఎ.తారకరామ్



జి.జ్ఞానేంద్ర



ఆర్.రవీంద్ర



ఎస్.అప్పన్న



ఆర్.శివసాయి



షేక్ సాధిక్



వి.గోపీచంద్

సింహాచలం: ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించి పలువురు విద్యార్థులు సత్తా చాటారు. సింహాచలంలోని ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల నుంచి ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్రంలోని పలు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించిన ఎ.తారక్‌రామ్, జి.జ్ఞానేంద్ర నూజివీడు ట్రిపుల్ ఐటీకి, 569 మార్కులు సాధించిన ఆర్.మోహన్, ఆర్.రవీంద్ర, 567 మార్కులు సాధించిన కె.డింపుల్‌కుమార్, 566 మార్కులు సాధించిన వి.గోపీచంద్, 565 మార్కులు సాధించిన ఆర్.శివసాయి, 554 మార్కులు సాధించిన షేక్ సాధిక్ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి, 566 మార్కులు సాధించిన ఎస్.అప్పన్న ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.



పట్నాల వర్షిత, పుష్పాంజలి

సబ్బవరం : బంగారమ్మపాలెం శివారు ఎ.శిరసపల్లి గ్రామానికి చెందిన దార పుష్పాంజలి ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆమె ఆరిపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 570 మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలలో చదివిన ఆరిపాకకు చెందిన పట్నాల వర్షిత శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటిలో సీటు సాధించారు. పదో తరగతి పరీక్షలలో 565 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచింది.

విశేషంగా ఏకాదశి తిరువీధి



మధనగోపాలస్వామికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



మధనగోపాలస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మధన గోపాలస్వామికి గురువారం విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడవీధుల్లో సాయంత్రం తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డిపాలెంలో ఇంటింటి సర్వే



ఆదిరెడ్డిపాలంలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న కొటాన రాము, తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సచివాలయం-2 పరిధిలో ఈ నెల 19న జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. దీనిలో భాగంగా సచివాలయం-2 పరిధిలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం సర్వే చేశారు. ఈ సర్వేను జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. వారం రోజుల పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పలు ధ్రువపత్రాలు అవసరమైన వారిని గుర్తించనున్నారు. జగనన్న సురక్ష క్యాంపులో వారికి ఆయా ధ్రువ పత్రాలు అందజేయనున్నట్లు కొటాన రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, ఎంఎల్‌వో హేమంత్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు మార్ట్‌లు

- సబ్బవరంలో 15న మహిళా మార్ట్ ప్రారంభం
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి



విలేకరులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి

సబ్బవరం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సెర్ప్ ఆదేశాల మేరకు మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మహిళల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న మార్టులను ఇప్పటికే మాడుగుల మండలంలో ప్రారంభించి సత్ఫలితాలు సాధించామన్నారు. సబ్బవరంలో నూతనంగా నిర్మించిన మహిళా మార్టును కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ నెల 15న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మార్టులో సరసమైన ధరలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ మార్టుల నిర్వహణకు వెలుగు మహిళా సంఘాల సభ్యులు 11 మంది బోర్డు డైరెక్టర్లుగా ఉంటారని తెలిపారు. రూ.15 వేలు అద్దె ప్రాతిపదికన సబ్బవరంలో మార్టు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. అనంతరం చోడవరం, కె.కోటపాడు, కోటవురట్ల, పాయకరావుపేట, పరవాడ మండలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. గ్రీన్ మిలీనియం పేరుతో పండ్ల జాతి మొక్కలను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపడుతున్నామని తెలిపారు. అనంతరం సబ్బవరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని పరిశీలించారు. మహిళలకు ఉపాధి కల్పించేలా ఆరు ఎఫ్‌టీసీ సెంటర్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన తోపాటు ఏరియా కో ఆర్డినేటర్ రాజేశ్వరి, సబ్బవరం వెలుగు ఏపీఎం సాయి రమేష్ ఉన్నారు

నేడు గుర్రంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

సింహాచలం: పెందుర్తి మండలం గుర్రంపాలెంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. ప్రజలు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస బహుళ ఏకాదశి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాల సర్ప, కుజ, రాహు, కేతు, దోష నివారణకు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం దీపారాధన చేసి సుబ్రహ్మణ్య స్వామిని పల్లకీలో ఊరేగించారు.

'జగనన్న సురక్ష'తో సత్వరమే ధ్రువపత్రాల మంజూరు

సింహాచలం: అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో 11 రకాల ధ్రువ పత్రాలు సత్వరం అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. 95వ వార్డు 499, 500, 501 సచివాలయాల సిబ్బందితో గురువారం ఆయన సమావేశమయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని, సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి జోబ్ దాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.మాధవరావు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో డాక్టర్ శశిప్రభ

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎన్జీవోస్ ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. సీఫా ఎన్జీవో, ఎస్‌బీసీసీ సంస్థలు సంయుక్తంగా గురువారం కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణ, రహదారి భద్రత, ఎకో వైజాగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. మరో అతిథి కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములకు ట్రాఫిక్ నిబంధనలను వివరించి అవి పాటించేలా చూడాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయమాలిని, సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, రమణి, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై సదస్సు



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న బాబు

సబ్బవరం: వ్యక్తిత్వ వికాసం-విద్యా ఉద్యోగ దీపిక అంశంపై సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ-సెట్విస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్.ఎ.బాబు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, యూత్ సర్వీసుల శాఖ సిబ్బంది బి.ఎస్.ప్రకాశరావు, ఎం.ఎస్.వి.సన్యాసిరావు, ఎస్.వెంకటేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ప్రిన్సిపాల్ మురళీ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా చేస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 882వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరి దుర్మార్గం



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న రామస్వామి

ఉక్కునగరం: అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంబిస్తోందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. గంగవరం పోర్టు కార్మికులకు సంఘీభావం తెలుపుతూ స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు పరిపాలన భవనం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్కడి కార్మికులను యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. అక్కడి విషయాలను కలెక్టర్‌కు విన్నవించినా, రాజకీయ పార్టీలు చర్చలు జరిపినా .. వారి ఆదేశాలను, సూచనలను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ గంగవరం ప్రజలు తమ ఉపాధిని, నివాసాలను పోర్టు కోసం త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలను యాజమాన్యం నేడు అపహాస్యం చేస్తోందన్నారు. యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఏకమై ఉద్యమించాలన్నారు. అధ్యక్షుడు వై.టి. దాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, బి. అప్పారావు, కె. గంగాధర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సులు చెల్లించాలి

ఈడీ వర్క్స్ బిల్డింగ్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను గతంలో వలే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద గురువారం ధర్నా చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అలవెన్సులపై ఈఎస్ఐ చెల్లించాలన్న ఈఎస్ఐ అధికారుల ఆదేశాలతో, కాంట్రాక్టర్లు కార్మికులకు అలవెన్సులను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశం యాజమాన్యంతో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే పూర్వ పద్ధతిలో అలవెన్సులు చెల్లించాలని కోరారు. అనంతరం హెచ్‌ఆర్ జీఎం బినయ్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కొవిరి అవతారం, ఉమ్మిడి అప్పారావు, పిట్టా రెడ్డి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్నేక్‌క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు



చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

ఉక్కునగరం: నిత్యం పాములతో ఆడుకునే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు తప్పలేదు. పెద్ద కోబ్రాలను, విష పాములను పట్టుకున్న ఆయన పాము పిల్లను పట్టు కునే ప్రయత్నంలో కాటుకు గురయ్యాడు. వివరాలివి.. స్టీల్ ప్లాంట్ విజిలెన్స్ విభాగంలో ఐదు రోజుల క్రితం పెద్ద నాగుపామును పట్టుకున్న కిరణ్‌కుమార్ బుధవారం అదే విభాగంలో ఉన్న 18 నాగుపాము పిల్లలను పట్టుకున్నారు. కిరణ్ సేవలను ప్రశంసిస్తూ విజిలెన్స్ విభాగం గురువారం ఉదయం ఆయన్ను సత్కరించింది. జీఎం వేణు ప్రశంసా పత్రం అందజేశారు. కొద్దిసేపటికి మరో పాము పిల్ల ఉన్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ విభాగానికి వెళ్లారు. దానిని పట్టుకునే ప్రయత్నంలో అప్పటికే కోరలు తెరిచి ఉన్న పాముపిల్ల కిరణ్‌కుమార్ చేతి ఉంగరం వేలుపై కాటు వేసింది. వెంటనే ఆయన అగనంపూడి ఆసుపత్రికి, అనంతరం కేజీహెచ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు.

యువతి అదృశ్యం

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎం.నవ్య అనే యువతి తల్లిదండ్రులతో కలిసి కైలాసపురంలో నివసిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు షాపునకు బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో తండ్రి ఎం.అప్పన్నబాబు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ వేలం వాయిదా

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 5వ జోన్ పరిధి జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 14న కాన్వెంట్ జంక్షన్ వద్ద గల ఐవోసీఎల్ పెట్రోల్ బంక్ స్థలం వేలం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, పూర్తి సమాచారం కోసం జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకులను పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com